క్లుప్తంగా

వరాహస్వామి విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు పూర్తి

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలో వరాహ స్వామి విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 26న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఉదయం 9.36 గంటలకు స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ, పుష్కరిని ప్రారంభించనున్నట్లు చెప్పారు.

విజేతలకు బహుమతుల అందజేత

బిక్కవోలు: సంక్రాంతి సందర్భంగా బిక్కవోలులోని కొత్తపేట రామాలయం వద్ద నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రామ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

టీబీ రోగులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ



పౌష్టికాహార కిట్లను అందిస్తున్న పీహెచ్‌సీ వైద్యురాలు విజయలక్ష్మి

బిక్కవోలు: కొంకుదురు పీహెచ్‌సీ పరిధిలోని టీబీ రోగులకు గురువారం పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ నిక్షయ్ మిత్ర కార్యక్రమంలో టీబీ రోగుల్ని గుర్తించి వారి ఆరోగ్యం మెరుగుపడేందుకు స్థానిక గ్రాసిం ఇండస్ట్రీస్ సహకారంతో పౌష్టికాహార కిట్లను అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్ఎం అనంతలక్ష్మి, సత్య తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పెదపూడి సచివాలయంలో ఆధార్ సేవలను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ హరికృష్ణ సత్యరెడ్డి

పెదపూడి: ఆధార్ కార్డులో మార్పులు, చేర్పుల కోసం పెదపూడి సచివాలయంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈఓపీఆర్డీ కె.హరికృష్ణ సత్యరెడ్డి అన్నారు. పెదపూడి సచివాలయం-1లో ఈ నెల 24వ వరకూ ఆధార్ సెంటర్ నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. శిబిరంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఈఓపీఆర్డీ హరికృష్ణ సత్యరెడ్డి చెప్పారు. ఆయన వెంట సచివాలయం కార్యదర్శి మన్యం శ్రీనివాస్ చౌదరి తదితరులున్నారు.

పాశాలమ్మకు ప్రత్యేక పూజలు



పాశాలమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరంలోని పాశాలమ్మ జాతర మహోత్సవం సందర్భంగా గురువారం అమ్మవారిని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా దర్శించుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా అమ్మవారి ఊరేగింపు జరిగింది. జాతర కమిటీ నాయకులు, సర్పంచ్ జాజుల రాము, ఎంపీటీసీ కాలచర్ల నాగేశ్వరరావు, హితకారిణి సమాజం డైరెక్టర్ కాలచర్ల శివాజీ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సీతానగరం: చినకొండేపూడికి చెందిన కేతమళ్ల రాజు (28) చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందాడని ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. వలంటీర్‌గా పనిచేస్తున్న రాజు ఈ నెల 15న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి చికిత్స మృతి చెందాడు.

వెంకట్రాజుకు పరామర్శ

సీతానగరం: రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీతానగరానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వలవల వెంకట్రాజు (తోటలో రాజు)ను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా గురువారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరి బాబు, మండల ప్రజా పరిషత్ సలహా మండలి చైర్మన్ చల్లమళ్ల సుజీరాజు తదితరులు పరామర్శించారు.

సొంతింటి కల.. నెరవేరిన వేళ

- జగనన్న కాలనీల్లో జోరుగా ఇళ్ల నిర్మాణం
- లబ్ధిదారుల ఆనందం



కోరుకొండ మండలం బొల్లెద్దుపాలెంలో జోరందుకున్న ఇళ్ల నిర్మాణాలు



రాజంపేటలో చివరి దశకు చేరిన ఇళ్లు

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో పేదల సొంతింటి కల సాకారమవుతోంది. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయి. రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాల్లోని 62 గ్రామాల్లో ఏర్పాటు చేసిన 52 లేఅవుట్లలో 9,193 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి మొదటి దశలో ఇళ్లు మంజూరయ్యాయి. దీంతో లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు జోరందుకున్నాయి. ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు అందజేస్తోంది. ఈ నగదును పునాది, రూఫ్ లెవల్, శ్లాబ్, నిర్మాణం పూర్తయ్యాక దశల వారీగా మంజూరు చేస్తోంది. నగదు లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలో జమ అవుతోంది. అలాగే సొంత స్థలం ఉన్న వారికీ గృహ నిర్మాణానికి అవకాశం ప్రభుత్వం కల్పించింది.

తప్పనున్న అద్దెలభారం

జగనన్న కాలనీలతో పేదలకు అద్దె ఇళ్ల భారం తప్పనుంది. ఈ రోజుల్లో స్థలాలను కొనుగోలు చేసి, ఇల్లు కట్టుకోవడం సామాన్యుడికి సాధ్యం కాదు. ఈ నేపథ్యంలో ఏళ్ల తరబడి అద్దె ఇళ్లలో ఇబ్బంది పడుతున్న వారికి సీఎం జగన్ అండగా నిలిచారు. సొంతింటి కలను సాకారం చేయడానికి చర్యలు తీసుకున్నారు. గ్రామాల్లో ఇళ్లలేని పేదలకు పారదర్శకంగా ఇళ్ల స్థలాలు కేటాయించారు. కుల, మత, వర్గ విభేదాలను తావులేకుండా అర్హతే ప్రామాణికంగా పథకం వర్తింపజేశారు. ఇంటి స్థలం కేటాయించడంతో పాటు నిర్మాణానికి సొమ్ములు ఇస్తున్నారు. ఆ ఇంటికి విద్యుత్ సౌకర్యం ఉచితంగా కల్పిస్తున్నారు. జగనన్న లేఅవుట్లలో రోడ్లు తదితర అన్ని వసతులు శరవేగంగా ఏర్పాటు చేస్తున్నారు.

పేదలకు అండగా..



నవరత్నాలు –పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వం అండగా నిలిచింది. గ్రామాల్లో 75 శాతం నిర్మాణాలు ప్రారంభమవ్వగా, 25 శాతం చివరి దశకు చేరుకున్నాయి. సొంతింటి కల సాకారం కావడంతో పేదలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.
– ఆకుల వెంకటేశ్వరరావు, హౌసింగ్ ఏఈ, కోరుకొండ

ఎమ్మెల్యే రాజా ప్రోత్సాహంతో..



ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రోత్సాహంతో ఇళ్ల నిర్మాణాలు మరింత జోరుగా జరుగుతున్నాయి. వందల ఇళ్లు ఒకేచోట నిర్మిస్తుండడంతో జగనన్న కాలనీలు ఊళ్లుగా రూపు దిద్దుకుంటున్నాయి. కాలనీల్లో వసతుల ఏర్పాటు చురుగ్గా సాగుతోంది.
– నక్కా రాంబాబు, ఏఎంసీ చైర్మన్

అన్ని వసతులు



జగనన్న కాలనీలు పెద్ద గ్రామాలుగా తయారవుతున్నాయి. ఇక్కడ ఇళ్లు కట్టుకున్న పేదలకు అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తున్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడిలో వేలమందికి స్థలాలివ్వనున్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు ధన్యవాదాలు.
– కొండపల్లి దుర్గారావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు

వ్యక్తి అదృశ్యంపై కేసు



సుక్కిరెడ్డి సాయి సుధాకర్(ఫైల్)

రంగంపేట: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు రంగంపేట ఎస్‌ఐ టి.రామకృష్ణ తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రమైన రంగంపేట గ్రామానికి చెందిన సుక్కిరెడ్డి సాయి సుధాకర్(40) కుటుంబ కలహాల కారణంగా ఈ నెల 17వ తేదీ రాత్రి 8.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. అతడి మావయ్య అక్కిరెడ్డి మార్కండేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రామకృష్ణ చెప్పారు.

అతివేగం వల్ల రోడ్డు ప్రమాదాలు

బిక్కవోలు: అతివేగం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని రాజమహేంద్రవరం ఎంవీఐ సంపత్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని ఆర్ఎస్‌పేట వద్ద 34వ రహదారుల భద్రత వారోత్సవాల్లో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాల్ని తగ్గించడానికి డ్రైవర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంవీఐలు సబిత, చైతన్య, బిక్కవోలు హెచ్‌సీ వీఎస్ శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘన సత్కారం



ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అనపర్తి: ప్రజలు సంక్రాంతి పండగను సంప్రదాయబద్ధంగా జరుపుకునేందుకు సహకరించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసిన నియోజకవర్గంలోని పెదపూడి మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పార్టీ పెదపూడి మండల కన్వీనర్ గుత్తుల రమణ, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస్, రొంగల అప్పాజీ, మాచిన గోవిందు, ఎంపీటీసీ సమ్మంగి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లంటే ప్రతిపక్షాలకు వణుకెందుకు?

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- గాదరాడలో గడపగడపకూ మన ప్రభుత్వం



గాదరాడలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: వలంటీర్లంటే ప్రతిపక్షాలకు వణుకు పుడుతోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం గాదరాడలో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను కలిసిన వలంటీర్లతో మాట్లాడారు. సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేయడంలో వలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రతినెలా ఒకటో తేదీన పక్కాగా పింఛన్లు అందిస్తున్న వలంటీర్లంటే ప్రతిపక్షాలకు వెన్నులో వణుకు పుడుతోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక వితండవాదం చేస్తున్నాయన్నారు. వలంటీర్ల ద్వారానే సంక్షేమ పథకాలు అర్హులకు సక్రమంగా అందుతున్నాయన్నారు. అలాగే గాదరాడ గ్రామాభివృద్ధికి రూ.5.21 కోట్లు కేటాయించామన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం రూ.1.65 కోట్లు మాత్రమే ఖర్చుచేసిందన్నారు. అర్హత గల ప్రతి ఒక్కరికీ నవరత్నాల పథకాలందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో 100 గడపలకు వెళ్లారు. సంగీత దర్శకుడు, గాయకుడు, నటుడు కుంచే రఘు తండ్రి కుంచే లక్ష్మీనారాయణరావు(90) ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శించారు. లక్ష్మీనారాయణరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు హరిబోలు చినబాబు, కె.శ్రీను, కె.శేఖర్, మామిడి సత్యనారాయణ, తోరాట శ్రీను, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు పాల్గొన్నారు.

వేమన పద్యాలతో సమాజ చైతన్యం



నన్నయ యూనివర్సిటీలో వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ ఇన్‌చార్జి ప్రసాదరాజు



వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఈఓపీఆర్డీ హరికృష్ణ సత్యరెడ్డి



పందలపాకలో వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

రాజానగరం: సామాన్యులకు అర్థమయ్యే భాషలో సాహిత్యాన్ని అందించి, సమాజాన్ని చైతన్యపరచిన ప్రజాకవి వేమన అని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఇన్‌చార్జి ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. యూనివర్సిటీలో గురువారం వేమన జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓఎస్డీ ఆచార్య ఎస్.టేకి, డాక్టర్ ఎ.మట్టారెడ్డి, ఎస్.లింగారెడ్డి, డాక్టర్ ఎం.గోపాలకృష్ణ, డాక్టర్ కేవీఎన్డీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా వేమన జయంతి వేడుకలు

పెదపూడి: ప్రజా కవి, తత్వవేత్త యోగి వేమన అని ఈఓపీఆర్డీ కె.హరికృష్ణ సత్యరెడ్డి అన్నారు. పెదపూడి మండల పరిషత్, సచివాలయంలో యోగి వేమన జయంతి ఘనంగా నిర్వహించారు. వేమన చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరికృష్ణ సత్యరెడ్డి మాట్లాడుతూ తెలుగువారి కీర్తిని నలుదిశలా చాటిన గొప్ప వ్యక్తి, ప్రజాకవి వేమనని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి మన్యం శ్రీనివాస్‌చౌదరి, మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధి హామీ పథకం ఏపీఓ కె.నాగమణి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: పందలపాక ఉన్నత పాఠశాల, మెళ్లూరు ఉన్నత పాఠశాలల్లో వేమన జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పందలపాక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చింతా వెంకట సోమిరెడ్డి మాట్లాడుతూ వేమన పద్యాల్లోని నీతిని గ్రహించి దానికి అనుగుణంగా నడుచుకోవాలని కోరారు. మెళ్లూరు ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం మూర్తి వేమన చిత్రపటానికి నివాళులర్పించారు.

పొలంబడితో సాగు పద్ధతులపై అవగాహన



నెలపర్తిపాడులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ సత్యప్రసాద్

కపిలేశ్వరపురం: డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంతో సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కలుగుతుందని మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ అన్నారు. వెదురుమూడి గ్రామ శివారు వ్యవసాయక్షేత్రంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏఓ రమేష్‌కుమార్ మాట్లాడుతూ 14 వారాల పాటు నిర్వహించే పొలంబడి ద్వారా విత్తనం నాటిన నాటి నుంచి కోత వరకూ రైతుకు అండదండగా వ్యవసాయాధికారులు నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో రైతు భరోసా సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: మండలంలోని నెలపర్తిపాడులో మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులను వ్యవసాయ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని సంకల్పించామన్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించడం ద్వారా రైతులు ఆర్థికంగా ఉన్నత స్థితికి చేరుకోవడానికి పొలంబడి ఉపయోగపడుతుందని ఏఓ వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సీతామహాలక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు శ్రావణి పాల్గొన్నారు.

కాటన్ బంగ్లాకు మరమ్మతులు చేపట్టాలి



జగన్నాథగిరిలో శిథిలావస్థలో ఉన్న కాటన్ దొర బంగ్లా

కాజులూరు: కాజులూరు మండలంలోని జగన్నాథగిరిలో ఉన్న చారిత్రక భవనం కాటన్ బంగ్లాకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. 1850–1870 కాలంలో బ్రిటిష్ పాలకులు గెస్ట్ హౌస్‌గా ఈ బంగ్లాను నిర్మించుకున్నారు. అనంతరం ధవళేశ్వరం ఆనకట్ట, కాలువల నిర్మాణ పనుల నిమిత్తం ఈ ప్రాంతంలో పర్యటించినపుడు సర్ ఆర్థర్ కాటన్ మహాశయుడు విశ్రాంతి తీసుకోవడానికి ఈ బంగ్లాను అభివృద్ధి చేసుకున్నారు. అప్పట్లో రవాణా సౌకర్యాలు అంతంత మాత్రమే. పంట కాలువల ద్వారా బోటులో ప్రయాణించి కోరంగి కెనాల్ పక్కనే ఉన్న ఈ బంగ్లాకి వచ్చి విశ్రాంతి తీసుకునేవారు. అప్పటి నుంచి అది కాటన్ బంగ్లాగా పేరుగాంచింది. స్వాతంత్ర్యం వచ్చాక ఆ బంగ్లాను ఇరిగేషన్ కార్యాలయంగా మార్చేయడంతో జగన్నాథగిరి సెక్షన్ ఇరిగేషన్ ఆఫీస్‌గా సేవలందిస్తుంది. అయితే శతాబ్దం క్రితమే నిర్మించిన ఈ బంగ్లా గోడలు ఇప్పటికీ పటిష్ఠంగానే కనిపిస్తున్నా పైకప్పు మాత్రం శిథిలావస్థకు చేరుకుంది. గతకాలపు జ్ఞాపకాలు, భవిష్యత్ తరాల వారు మరిచిపోకుండా ఉండాలంటే శిథిలమవుతున్న బంగ్లాకు అధికారులు మరమ్మతులు చేయించి అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులు

సీతానగరం: కాటవరంలోని మహతి హైస్కూల్ విద్యార్థులు ఇంటర్ నేషనల్ మేథ్స్ ఒలింపియాడ్ పరీక్షలో జోనల్ స్థాయిలో బంగారు పతకాలు సాధించారని కరస్పాండెంట్ ఎ.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. న్యూఢిల్లీకి చెందిన మ్యాథ్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ నిర్వహించిన ఈ పరీక్షలో ఒకటి నుంచి 10వ తరగతి వరకు మొత్తం 45 మంది జోనల్ గోల్డ్ మెడల్స్, 32 మంది విద్యార్థులు లెవెల్ –2కి ఎంపికయ్యారన్నారు. వారిని ఐఐటీ అకడమిక్ డైరెక్టర్ ఎ.రాంప్రసాద్ తదితరులు అభినందించారు.

ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలి



విద్యార్థులకు యోగాపై శిక్షణనిస్తున్న శ్రీనివాసచౌదరి

రాయవరం: ప్రతి విద్యార్థి ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకుని లక్ష్య సాధన వైపు అడుగులు వేయాలని విశ్వ మానవత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి పేర్కొన్నారు. మండలంలోని వెంటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం యోగా, వ్యక్తిత్వ వికాసంపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్‌ఎం డి.సత్తిరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీనివాసచౌదరి మాట్లాడుతూ స్వామి వివేకానందుని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం చాలా ముఖ్యమన్నారు. మానవతా యువ నాయకత్వ శిక్షణ శిబిరానికి 12 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. సమావేశంలో ఉపాధ్యాయులు సీహెచ్‌వీ శ్రీరామచంద్రమూర్తి, ఆర్ఎస్ఆర్ఎస్ బాబా, కె.శ్రీనివాస్, ఎన్ఎస్ఎన్‌వీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట విద్యుత్ సబ్‌స్టేషన్లలో 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ లైన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జగ్గంపేట విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు, ఏఈ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఇండస్ట్రియల్ సర్వీసులకు, సుకృతి లేఅవుట్‌కు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు.

నేడు కొంకుదురులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

బిక్కవోలు: మండలంలోని కొంకుదురులో మరమ్మతుల పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఏఈ బుచ్చిదొర తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు చెప్పారు.

అనపర్తి: స్థానిక పాతవూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మార్కెట్ ఫీడర్, రైల్వేస్టేషన్ ఫీడర్‌కు మరమ్మతుల పనులు నిర్వహిస్తున్న కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని రామచంద్రపురం ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ఫీడర్లపై ఉన్న రాముడమ్మపేట, మార్కెట్, బుల్లియ్యగారి తోట, గాంధీనగర్, రైల్వే స్టేషన్ ప్రాంతం, బాబా నగర్, సునందనపేట, మార్కండేయపురం, షారోనుపురం, ఎన్టీఆర్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు చెప్పారు.

జాతీయ స్థాయి పోటీలకు మండపేట విద్యార్థులు

మండపేట: మండపేట ఎస్‌వీఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు గురువారం కళాశాల పీడీ ఈవీవీ సత్యనారాయణ తెలిపారు. ఏలూరులో బుధవారం జరిగిన రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీల్లో తమ కళాశాల నుంచి ఎల్.త్రిమూర్తులు, ఆర్.రాజు, జి.సంతోష్‌లు గోల్డ్ మెడల్స్ సాధించారన్నారు. వీరిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన త్రిమూర్తులు, రాజు త్వరలో కశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారన్నారు. తిరుపతిలో జరిగిన అండర్ 19 రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ఎల్.కామేష్ బాబు 100, 50 మీటర్ల విభాగాల్లో తృతీయస్థానం సాధించి రెండు మెడల్స్‌ను కైవసం చేసుకున్నాడన్నారు. విశాఖపట్నంలో జరిగిన అండర్ 19 రాష్ట్ర స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీల్లో అబ్దుల్ రహీం ద్వితీయస్థానం సాధించాడని పీడీ సత్యనారాయణ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేగుళ్ల చైతన్యబాబు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అత్తిలి శ్రీనివాస్, లెక్చరర్లు బీఏఆర్ విశ్వనాథమ్, ఇజ్జిన సమర్పణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.